

## కథ

సోమవఝుల నాగేంద్రప్రసాద్

# ఆడపిల్ల చదువు

"అమ్మా! ప్రియా తొందరగా రా తల్లీ. మన ఊరు నుండి కాకినాడ చాలా దూరం కూడాను. తొందరగా బయలుదేరకపోతే పరీక్ష టైముకు ఎగ్జాము సెంటరు చేరడం కష్టం" 'ఎంసెట్' రాయబోతున్న కూతురు ప్రియనుద్దేశించి అన్నాడు రాఘవ.

"అబ్బా ఎందుకండీ దాన్నలా ఊదరగొట్టేస్తున్నారు. పరీక్షకు ఇంకా బోల్డంత టైముంది" భర్త చేతికి హెల్మెట్టు ఇస్తూ అంది భార్య సుగుణ.

"చూడు సుగుణా! తెలియకుండా మాట్లాడకు. ఐనా ఎగ్జామ్ అన్న తర్వాత కొంచెం ముందుగా బయలుదేరితే మంచిది" అని సుగుణతో అన్న రాఘవ "అమ్మా ప్రియా! అయిందా?" అంటూ మరోసారి కూతుర్ని పిలిచాడు.

"ఆ... ఇదిగో వస్తున్నాను నాన్నా" అంటూ హడావిడిగా వచ్చిన ప్రియ ముందుగా తాతగారి కాళ్లకు దణ్ణం పెట్టి తరువాత తల్లి కాళ్లకు దణ్ణం పెట్టడంతో "పెద్దలంటే ఆమెకున్న గౌరవానికి, సంస్కారానికి" ఎంతో మురిసిపోయారు రాఘవ దంపతులు.

"అమ్మా! ప్రియా ఆ హాల్‌టిక్కెట్టు, పెన్నులు అవీ పెట్టుకున్నావో లేదో చూడు" చెప్పాడు రాఘవ.

"ఆ.. అన్నీ పెట్టుకున్నాను నాన్నా!" అంటూ తల్లికి టాటా చెబుతూ తండ్రి వెనకే బండిమీద కూర్చుంది ప్రియ. దార్లో వెళ్తున్నంత సేపు కూతురికి పరీక్ష రాయడంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి చెబుతూనే ఉన్నాడు రాఘవ. తండ్రి చెప్పిన జాగ్రత్తలన్నింటిని ఓపిగ్గా వింటూ ఊ కొడుతున్న ప్రియ పరీక్ష హాలు రావడంతో స్కూటరు మీంచి దిగింది.

"తల్లీ! జాగ్రత్తగా రాయి, ఆల్ ద బెస్ట్" అంటూ ప్రియను ఎగ్జామ్ హాల్‌లోకి పంపించిన రాఘవ తిరిగి ఆమె వచ్చేంతవరకు అక్కడే ఉన్న చెట్టునీడన బండిని పార్కు చేసి కూర్చున్నాడు.

★ ★ ★

"అమ్మా ప్రియా! పేపరు ఎలా రాశావమ్మా?" పరీక్ష రాసొచ్చిన కూతుర్ని ఆత్రంగా అడిగాడు రాఘవ.

"చాలా బాగా రాశాను. ఐతే ఫిజిక్స్ పేపరే కొంచెం టఫ్‌గా ఉంది. ఐనా నాకు వచ్చినంత మటుకు బాగానే ఆన్సరు చేశాను. మంచి ర్యాంకే రావచ్చును నాన్నా" ఆనందంగా చెప్పింది ప్రియ.

"పోనీలేమ్మా, మంచి ర్యాంకు వచ్చి గవర్నమెంటు మెడికల్ కాలేజీలో సీటు వస్తే డొనేషన్ల బాధ తప్పుతుంది" బండిని స్టార్టు చేస్తూ అన్నాడు రాఘవ. ఇంటికి వస్తున్నంత సేపు పరీక్ష పేపరు గురించే మాట్లాడింది ప్రియ.

ఇంటికి వచ్చిన ప్రియను అటు తాతయ్య, ఇటు సుగుణ కూడా ప్రశ్నల వర్షంతో ముంచెత్తారు. అందరికీ ఓపిగ్గా సమాధానం చెప్పిన ప్రియ ఫ్రెష్ అవడానికి తన రూములోకి వెళ్లడంతో "ఏవండీ! మన ప్రియమ్మ పరీక్ష ఎలా రాసిందండీ" అమాయకంగా రాఘవని అడిగింది సుగుణ.

"అదేంటి సుగుణా! అలా అడుగుతున్నావు. అది బాగానే రాసిందని చెప్పింది కదా! ఏం దాని మాటల మీద నమ్మకం లేదా?" నవ్వుతూ ప్రశ్నించాడు రాఘవ.

"అలాగని కాదండి. ఈ కాలం పిల్లలు పరీక్షలు ఎలా రాసినా బాగానే రాశాను అంటారు. తీరా రిజల్ట్స్ వచ్చిన తరువాత అనుకోని ర్యాంకులు, మార్కులు రాకపోతే తట్టుకోలేక ఆవేశంలో ఏదో ఒక అఘాయిత్యానికి పూనుకుంటారు" చెప్పింది సుగుణ.

"అవును సుగుణా నువ్వన్నది నిజమే! కానీ మన ప్రియ అలాంటిది కాదు. కాలేజీలో అది ర్యాంకు హోల్డరు కదా, తప్పకుండా ఎంసెట్టులో మంచి ర్యాంకే వస్తుంది" కూతురు మీదున్న నమ్మకంతో ఎంతో ధీమాగా అన్నాడు రాఘవ.

★ ★ ★

"నాన్నగారు నాకు ఎంసెట్టులో మంచి ర్యాంకొచ్చింది" ఇంటర్నెట్టులో రిజల్ట్స్ చూసుకున్న ప్రియ ఎంతో ఆనందంగా చెప్పింది.

"కంగ్రాట్స్ తల్లీ. అనుకున్నది సాధించావు" అభినందనగా అన్న రాఘవ, "అమ్మా నీకొచ్చిన ర్యాంకుకు మంచి గవర్నమెంటు మెడికల్ కాలేజీలో సీటు వస్తుంది. ఇంతకీ నీకు ఎక్కడ చదవాలని ఉంది?" అడిగాడు రాఘవ.

"నాన్నా నాకు హైదరాబాద్ గాంధీ మెడికల్ కాలేజీలో చదవాలని ఉంది" మెల్లగా తన మనసులో మాటను చెప్పింది ప్రియ.

"ఏంటి హైదరాబాద్ లాంటి మహా పట్టణంలో చదువుతావా? ఏం నీకొచ్చిన ర్యాంకుకి చుట్టుపక్కల ఏ మెడికల్ కాలేజీలోను సీటు రాదా?" అడిగింది సుగుణ.

"వస్తుందమ్మా, కానీ ఆ కాలేజీలో చదువు బాగా చెబుతారు" తల్లికి చెప్పింది ప్రియ.

"ఇక్కడే దగ్గర్లోనే సీటొస్తే హాయిగా ఇంటిపట్టు నుండి చక్కగా చదువుకోవచ్చుగా. అదే వేరే ఊళ్లో ఐతే హాస్టలు ఫీజులకి వాటికి ఎంత ఖర్చవుతుందో ఏనాడైనా ఆలోచించావా? ఐనా ఆడపిల్లని ఒక్కర్తిని వంటరిగా అంతంత దూరాల్లో ఉంచి చదవించడం అంత మంచిది కాదు. ఇక్కడైతే మా కళ్ల ముందే ఉంటే నీ బాగోగులు, మంచీ చెడ్డా మేమే చూసుకుంటాము. అక్కడ మనకెవరున్నారు నీ మంచి చెడ్డలు చూడడానికి?" అడిగింది సుగుణ.

తల్లీ, కూతుళ్ల సంభాషణ వింటున్న రాఘవ మనసులోనే నవ్వుకున్నాడు.

"ఏంటండీ! అలా బెల్లంకొట్టిన రాయిలా చూస్తారేం. మీరైనా దానికి చెప్పొచ్చుగా?" ఉడుకుమోత్తనంగా అంది సుగుణ.

"అబ్బా సుగుణా! వెనకటికి నీలాంటిదే ఎవర్తో 'ఆలు లేదు చూలు లేదు కొడుకు పేరు సోమలింగం అందట' అలా ఉంది నీ ప్రవర్తన. ఇంకా ఇప్పుడేగా రిజల్ట్స్ వచ్చాయి. ఓ నెల్లాళ్ల తర్వాత గానీ కౌన్సిలింగ్‌కు పిలవరు. ఈ లోపులో మన ప్రియకు ఏ కాలేజీలో సీటు వస్తుందో చూచాయగా తెలుస్తుంది. అంతవరకు


నువ్వు అనవసరంగా వర్రీ అవకు" అంటూ ఆమెకు సర్ది చెప్పాడు రాఘవ.

★ ★ ★

మెడికల్ కౌన్సిలింగులో ప్రియ కోరుకున్నట్లే హైద రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీలో సీటు రావడం, వచ్చేనెల మూడవ తారీకులోపలే హాస్టల్ ఫీజు, కాలేజీ ఫీజు కట్టమని చెప్పడంతో, అన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేసుకుని ఇంటికి వచ్చాడు రాఘవ.

"బావుందండీ, మొత్తానికి అది కోరుకున్న చోటే జాయిన్ చేశారు కదూ! అవును లెండి మీరూ మీరూ ఒకటే. మీకు నా మాటంటే అసలు లక్ష్యం లేదు. ఊరుగాని ఊళ్లో ఆడపిల్లని ఒక్కర్తినే ఉంచి ఎలా చదివిస్తారో కొంచెమైనా ఆలోచించారా?" నిష్ఠూ రంగా అంది సుగుణ.

"అబ్బా సుగుణా! ఇప్పుడేమయిం దని. ఈ రోజుల్లో ఎంతోమంది ఆడపి ల్లలు బయట ఊళ్లల్లో ఉండి చదువు కుంటున్నారు. అలాగే మన ప్రియ కూడా వేరే ఊళ్లో ఉండి చదువుకుం



టుంది. ఇందులో నువ్వు భయపడవల్సింది ఏమీ లేదు. అనవసరంగా ఏవేవో ఊహించుకుని మనసు పాడుచేసుకోకు" అంటూ ఎంతో అనునయంగా చెప్పాడు రాఘవ.

"ఏమోనండి, మీరు ఎన్నయినా చెప్పండి తల్లిగా నా భయం నాది" బాధగా అంది సుగుణ.

"అమ్మా నువ్వు అంతగా భయపడవ లసింది ఏమీ లేదమ్మా. నేను మీ పెంప కంలో పెరిగినదాన్ని" ప్రియ కూడా తల్లికి సర్ది చెప్పింది.

"ఏమోనమ్మా మీ ఇష్టం. నేను చెబ్తే మాత్రం మీరు వింటారా ఏంటి" అంటూ వంట సంగతి చూద్దం కోసం వంటింట్లోకి దూరింది సుగుణ.

★ ★ ★

"ఏంటండీ అలా ఉన్నారు? దేని గురించి అంత తీవ్రంగా ఆలోచిస్తున్నారు?" కిచన్లో పనులన్నీ పూర్తి చేసు కొచ్చిన సుగుణ పడకగదిలో భర్త రాఘవ పక్కన కూర్చుంటూ అడిగింది.

"అబ్బే ఏం లేదు సుగుణా!" అంటూ విష యాన్ని దాటేయబోయాడు రాఘవ.

"ఏం లేదంటారు ఏమిటి. ఏమీ లేకపోతే మీరెందు కలా పరధ్యానంగా అదోలా ఉన్నారు?" తిరిగి అడి గింది సుగుణ.

"నిజమే సుగుణా, నువ్వు ఊహించింది కొంతవ రకు నిజమే. నేను మన ప్రియమ్మ గురించే ఆలోచిస్తు న్నాను" ఉపోద్ఘాతంగా అన్నాడు రాఘవ.

"మన ప్రియ గురించా? ఏంటండీ అసలేం మాట్లా డుతున్నారు?" ఆదుర్దాగా అడిగింది సుగుణ.

"సుగుణా మన ప్రియను వేరే ఊళ్లో ఉంచి చదివిం చాలంటే నాకూ భయంగానే ఉంది" చెప్పడం ఆపాడు రాఘవ.

"అదేంటండి మరి ఆనాడు నేను అంతలా చెపు తున్నా ఏం మాట్లాడలేదు. పైగా దాన్ని అది కోరుకున్న కాలేజీలోనే జాయిన్ చేశారు. మరి ఇప్పుడేంటి ఇలా అంటున్నారు" అడిగింది సుగుణ.

"అది కాదు సుగుణా! ఆ రోజున ఈ విషయం మన ప్రియ ముందు చర్చించడం ఇష్టంలేక అలా అన్నాను. ఎంతైనా నేను కూడా ఓ ఆడపిల్ల తండ్రినే

కదా! ఈ రోజుల్లో పిల్లలు చాలా ఫాస్టు. వాళ్లు చేస్తున్న పనులు మనకు తెలిసే లోపులోనే జరగాల్సిన అనర్థం జరిగిపోతోంది. అందుకే నాకు భయంగా ఉంది" మన సులో ఏదో మూలనున్న భయాన్ని బయటపెడుతూ బేలగా అన్నాడు రాఘవ.

"ఛ.. ఊరుకోండి. మన ప్రియ అందరిలాంటి ఆడ పిల్ల కాదండి" అతనికి ఊరటగా చెప్పింది సుగుణ.

"నిజమే సుగుణా, మన ప్రియ మీద నాకా నమ్మక ముంది. ఐతే ఈ రోజుల్లో పిల్లల ప్రవర్తన ఎప్పుడు ఎలా ఉంటుందో చెప్పడం కష్టం. కుర్రతనం, వెస్టన్ కల్చర్ మోజుతో ఏమైనా చెయ్యొచ్చును. వయసు వేడిలో వాళ్లు ఏం చేస్తున్నారో తెలియకుండా చేజే తులా కొంతమంది తమ జీవితాలను పాడుచేసుకుం టున్నారు. అందులోను ఈనాటి ఎలక్ట్రానిక్ యుగంలో ఏదైనా సాధ్యమే. కొత్తన్నది లేకుండా చాలా ఈజీ అయిపోయింది. వేరే ఊళ్లల్లో ఉండడం వలన పెద్దవాళ్ల అదుపులు, ఆంక్షలు ఉండకపోవ డంతో స్వతంత్రత పెరిగి హద్దులు మీరే ప్రమాద ముంది. ఈ కాలం పిల్లలు ప్రతి విష యాన్ని చాలా క్యాజువల్‌గా తీసు కుంటున్నారు" అంటూ ప్రియ విష యంలో మొదటిసారిగా ఆమెతో మనసు విప్పి మాట్లాడాడు రాఘవ.

"అబ్బా.. ఊరుకోండి. మీరు అనవసరంగా ఏవేవో ఊహించు కుంటున్నారు. అటువంటివి ఏమీ జరుగవు. మీరు నిశ్చింతగా పడు కోండి" అంటూ నిద్రకుపక్రమిం చింది సుగుణ.

రాఘవ ఆమె మాట కాదనలేక నిద్రబోవడానికి ప్రయత్నించినా ఇంకా ఆయన ఆలోచనలన్నీ కూతురు గురించే సాగాయి.

అర్ధరాత్రి దాటినా ఎప్పటికీ తెగని ఆలోచనలతో నిద్ర పట్టని రాఘవ ఏం చేయాలో తోచక ప్రియ ఉన్న రూములోకి వెళ్లి ఎంతో హాయిగా నిద్రపోతున్న ప్రియ తలను ప్రేమగా నిమిరాడు.

తలమీద ఏదో మెత్తగా ప్రాకి నట్లు అనిపించడంతో ఉలిక్కిపడి లేచిన ప్రియ ఎదురుగుండా తండ్రిని చూసి ఆశ్చర్య పోయి "ఏంటి నాన్నా అలా ఉన్నారు?. ఓ... రేపు నేను వెళ్లిపోతున్నానని బెంగగా ఉందా?" అమాయకంగా అడిగింది.

"బెంగ కాదమ్మా, భయం" మెల్లగా ఆమెకు మాత్రమే వినబడేలా అన్నాడు రాఘవ.

"భయమా! ఏ విషయంలో నాన్నా?" అడిగింది ప్రియ.

"ఏ విషయం అంటే ఏం చెప్పను. ఐనా నీతో ఆ విషయం ఎలా చెప్పాలో తెలియడం లేదు" అంటూ చెప్పడం ఆపాడు రాఘవ.

"ఏ విషయం గురించి నాన్నా?" తిరిగి అడిగింది ప్రియ.

"అదేనమ్మా పై ఊళ్లకు వెళ్లే 'ఆడపిల్ల చదువు' విష యంలో తల్లిదండ్రులు పడే మనోవేదన. ఇలా చదు వుల కోసం వెళ్లిన కొంతమంది ఆడపిల్లలు వెర్రిమొర్రి మోజులతో జీవితాలను పాడుచేసుకుంటున్నారు. అలాగే అబ్బాయిలు కూడా తమ అవసరం తీరేంతవ రకు చాలా చక్కగా నటిస్తూ, అమాయకులైన ఆడపిల్ల లను నమ్మిస్తూ తమ అవసరం తీర్చుకుంటున్నారు. తీరా అవసరం తీరిన తరువాత ముఖం చాటేస్తూ తప్పించుకు తిరుగుతున్నారు. అందుచేత నువ్వు ఫ్రెండ్స్ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలమ్మా. అనవసరపు స్నేహాలు పెంచుకోకు. ప్రియా! నీ మీద నాకా నమ్మకముందమ్మా" ఆమెను దగ్గరగా తీసు కుంటూ ప్రేమగా అన్నాడు రాఘవ.

తండ్రి మనసులోని భయాన్ని అర్థం చేసుకున్న ప్రియ "నాన్నా మీరు ఏవేవో ఊహించుకుని అనవస రంగా భయపడుతున్నారు. నేను మీ పెంపకంలో పెరి గిన దాన్ని. నా హద్దులు నాకు తెలుసు. స్వేచ్ఛ దొరి కింది కదాని ఏనాడూ హద్దులు మీరి ప్రవర్తించను. అలాగే మీకు చెడ్డ పేరు తెచ్చే పనులు అసలు చేయను. ఇంక మీరు ఈ విషయంలో వేరే ఆలోచనలు పెట్టు కుని మనసును పాడుచేసుకోకుండా వెళ్లి హాయిగా నిద్రపొండి" అంటూ అతని రూములోకి పంపించివే సింది ప్రియ.

"సరేనమ్మా, నువ్వు కూడా పడుకో" అంటూ తన రూములోకి వచ్చి పడుకున్న రాఘవ ఎప్పటికో నిద్ర పోయాడు.

* * *

రాత్రి గౌతమి ఎక్స్‌ప్రెస్‌లో తల్లిదండ్రులను సాగనంపడానికి సికింద్రాబాద్ స్టేషనుకు వచ్చిన ప్రియ తండ్రి ముఖంలోని భయాన్ని, ఆందోళనను గమనించి "ఇంకా మీరు నా గురించి భయపడుతున్నారా నాన్నా? మీకు తల వంపులు తెచ్చే పనులు ఏమీ చేయ కుండా బుద్ధిగా చదువుకుని నేను మీ పెంపకంలో పెరిగిన దాన్ని అని నిరూ పించుకుంటాను. కాబట్టి నామీద నమ్మకముంచి ఇంక మీరు నిర్భ యంగా బయలుదేరండి. ఉంటాను నాన్నా" కదులుతున్న రైలుతో పాటుగా తానూ నడుస్తూ, కళ్లతోనే వారికి ధైర్యం చెప్పిన ప్రియ బరువెక్కిన గుండెలతో హాస్టలుకి తిరిగి బయలుదేరింది.




## డబ్బే డబ్బు!

ఆయా తారలకు బదులుగా వారి పేర్లను కూడా క్యాష్ చేసుకోవడం కనిపిస్తోందీమధ్య. ఇక్కడ మీకు కనిపిస్తున్న పోస్టర్ బిపాషా బసు నటించిన చిత్రానిదని అనుకుంటారు కదూ! కానీ కాదు, ఓ కొత్త తార నటించిన సినిమా. కేవలం బిపాషా పేరును ఉపయోగించుకుని జనాల్ని థియేటర్లకి రప్పించేందుకు చేసే ప్రయత్నాలన్నమాట. పైగా ఇలాంటివి బూతు సినిమాల కేటగిరీ లోకే వస్తాయి. యు.పి., బీహారులోని కొన్ని ప్రాంతాల్లో ఇలాంటి చిత్రాలు విడుదలై బాగా సొమ్ము చేసుకుంటున్నాయట.